హెచ్‌సీయూ భూములను కాపాడుకోవాలి

డివిజన్ అధ్యక్షుడు వంశీరెడ్డి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు వంశీరెడ్డి తదితరులు

ఆల్విన్‌కాలనీ: హెచ్‌సీయూ భూములను కాపాడుకోవాలంటూ బీజేపీ వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ యస్. వంశీరెడ్డి ఆధ్వర్యంలో వివేకానందనగర్‌లోని వివేకానందుని విగ్రహం వద్ద గురువారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ప్రభుత్వం చర్యలు పర్యావరణానికి తీవ్ర నష్టాన్ని కలిగించే విధంగా ఉన్నాయని ప్రకృతిని రక్షించాలని వంశీరెడ్డి సూచించారు.ఈ సందర్భంగా పోలీసులు నిరసన కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు శ్రీహరి యాదవ్, నర్సింగరావు, శంకరన్న, శ్రీనివాస్, గోపాలరావు, రేషన్‌రాజు, భాస్కర్‌రెడ్డి, వేణు, మమత, జయ శ్రీ, రేణుక, సందీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చల్లబడ్డ వాతావరణం

ఉరుములు, మెరుపులతో వర్షం



గచ్చిబౌలిలో వర్షం కురుస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో వర్షం రావడంతో ఉపశమనం కలిగింది. ఎండలు పెరుగుతున్న క్రమంలో వర్షం పడడంతో ఊపిరి పీల్చుకున్నారు. కొన్నిచోట్ల రోడ్లపైకి వరద నీరు వచ్చింది. జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పలు ప్రాంతాల్లో పరిస్థితిని పర్యవేక్షించారు.

ఏడాదైనా తొలగించరా..?

తారానగర్‌లో రోడ్డ పక్కన సిమెంట్ పైప్‌లు..రాకపోకలకు ఇబ్బందులు



తారానగర్‌లో రోడ్డు పక్కన వేసిన పైప్‌లు

శేరిలింగంపల్లి: చందానగర్ డివిజన్ తారానగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సిమెంట్ పైప్‌లు ఏడాదిగా రోడ్డు పక్కనే పడి ఉన్నాయి. తారానగర్ హోల్‌సేల్ వ్యాపారాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. హోల్ సేల్ దుకాణాలకు వచ్చే వ్యాపారుల వాహనాలు కూడ రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు సిమెంట్ పైప్‌లను తొలగించాలని స్థానిక వ్యాపారులు, వాహనదారులు కోరుతున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ మంజూరుపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్ : కొండాపూర్ డివిజన్ పరిధి ప్రేమ్ నగర్‌కి చెందిన సునీల్‌కుమార్‌కు రూ.50వేలు , హఫీజ్‌పేట్‌కు చెందిన ఈరవల్లి పేరుమరావులకు రూ.30 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, చంద్రకాంత్‌రావు, పాతూరి వెంకటరావు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో డీసీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వి.ప్రశాంతి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఒక వ్యక్తి రెండు ప్రాంతాల్లో ఓటరుగా నమోదు అయినట్లు గుర్తించామని వివరించారు. ఇలా 4500 వరకు ఉన్నారని, ఆయా ప్రాంతాల్లోని బీఎల్‌ఓలతో విచారణ చేయిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీలు కూడా బీఎల్‌ఏలను పోలింగ్‌స్టేషన్ల వారీగా ఏర్పాటు చేస్తే త్వరితగతిన ఎంక్వైరీ పూర్తి చేయవచ్చన్నారు. ఏఎంసీలు ప్రేమ్ కుమార్, శ్రావణ్‌కుమార్ రెడ్డి, ట్యాక్స్ ఇన్స్పెక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.




- రోల్‌మోడల్‌గా రాయదుర్గం వైకుంఠ మహాప్రస్థానం
- ప్రపంచంలో ఎక్కడి నుంచైనా దహన సంస్కారాలు తిలకించే సౌకర్యం
- తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా, కాశీలో కూడా ఫినిక్స్ సంస్థ మహాప్రస్థానాల ఏర్పాట్లు



మహాప్రస్థానంలో దివ్య స్థల్ విద్యుత్ దహనవాటిక

మహాప్రస్థానం సేవల కొరకు సంప్రదించాల్సిన నంబర్ : 9852555555

పదేళ్ల ప్రస్థానం ..



రాయదుర్గంలోని వైకుంఠ మహాప్రస్థానం ప్రధాన ద్వారం

రాయదుర్గం: వైకుంఠ మహాప్రస్థానం రోల్‌మోడల్‌గా నిలిచింది. ఫినిక్స్ సంస్థ సేవా దృక్పథంతో జీహెచ్‌ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైకుంఠ మహా ప్రస్థానంను 2015 మార్చి 30న అప్పటి మంత్రి వెంకయ్యానాయుడు ప్రారంభించారు. ఇదే తరహాలో బంజారాహిల్స్, బేగంపేటలోనే కాకుండా ఏపీలోని మంగళగిరి, కాశీ వంటి ప్రాంతాలలో కూడా ఏర్పాటు చేశారు. దేశంలోనే ఎకోఫ్రెండ్లీ శ్మశానవాటికగా రాయదుర్గం మహాప్రస్థానం గుర్తింపు సాధించింది.

- జూబ్లీహిల్స్ నుంచి ఫిలింనగర్ వెళ్లే రోడ్డులో రాయదుర్గం మహాప్రస్థానం 3.7 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇక్కడ గతంలో ఉన్న సమాధులు చెక్కుచెదరకుండా వాటి చుట్టూ గ్రీనరీ, పూల మొక్కలను పెంచుతున్నారు.
- ఇక్కడ జరిగే అంత్యక్రియలను వైఫై సౌకర్యంతో ప్రపంచంలో ఎక్కడ ఉన్నా చూడవచ్చు,
- ఇందులో 33 మంది సిబ్బంది పూర్తిస్థాయిలో సేవా దృక్పథంతో పనిచేస్తున్నారు.
- చుక్కపల్లి శంకర్‌రావు మెమోరియల్ ఆధ్వర్యంలో 2013లో అప్పటి ఎమ్మెల్యే భిక్షపతియాదవ్, ఫినిక్స్ గ్రూప్ చైర్మన్ చుక్కపల్లి సురేష్‌లు శంకుస్థాపన చేశారు.
- ప్రస్తుతం మహాప్రస్థానంలోని 7 దహనవాటికల్లో నెలకు సుమారు 150 నుంచి 200 మంది వరకు దహన సంస్కారాలను నిర్వహిస్తోంది.
- ఇందులో 5 బర్నింగ్ ప్లాంట్లు, ఒక ఎలక్ట్రికల్, ఒక గ్యాస్ ఆధారిత ప్లాంట్ కొనసాగుతున్నాయి.
- ప్రతి దహనవాటికకు పక్కనే వెయిటింగ్ హాల్ నిర్మించారు. పిండ ప్రదానాలకు సిరిమోనియల్ యార్డ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పూజారి, ఇతర సేవలు ఉన్నాయి.
- ప్రత్యేకంగా ×యాషెస్ స్టోరేజ్ లాకర్స్‌₹ సౌకర్యం ఉంది. మృతదేహాలను భద్రపరిచే కోల్డ్ రూమ్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.
- కర్మకాండ వస్తువులు ఇక్కడ ఉన్న స్టోర్‌లో లభ్యమవుతున్నాయి
- వచ్చినవారికి క్యాంటిన్, తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉన్నాయి.
- ప్రత్యేక బుక్‌స్టోర్, విశాలమైన కార్ పార్కింగ్, సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బంది. వాష్ రూమ్స్, డ్రస్ ఛేంజింగ్ రూమ్స్, మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నాయి.
- మృతదేహాన్ని ఆస్పత్రి లేదా ఇంటి నుంచి తీసుకొచ్చేందుకు ప్రత్యేక వాహనాలను సైతం అందుబాటులో ఉంచారు.

అవార్డులు

- ఫినిక్స్ గ్రూపు మహాప్రస్థానం నిర్మించడంతో పలు అవార్డులను సొంతం చేసుకుంది. అందులో 2017లో ఏసీఈఎఫ్ ద్వారా ఎక్స్‌లెన్స్ ఇన్ సీఎస్‌ఆర్ అవార్డు,
- సీఎంఓ ఏఎస్ఐఏ ద్వారా స్మార్ట్ సీఎస్‌ఆర్ ఇనీషియేటివ్ అవార్డు
- హెచ్ఎంఏ ద్వారా సీఎస్‌ఆర్ అవార్డు ఆఫ్ ది ఇయర్ -2017గా గుర్తింపు పొందింది. ఇలా పలు అవార్డులను సాధించింది.



సాధారణ దహనవాటిక



నేడు శంకుస్థాపన

రాయదుర్గం: కొండాపూర్ డివిజన్‌లోని ఓయూ ప్రొఫెసర్స్ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. అంతర్గతరోడ్లను దశలవారీగా సీసీ రోడ్లుగా మార్చే ప్రక్రియలో భాగంగా రూ.60.70 లక్షల వ్యయంతో రోడ్డు పనులను చేపట్టనున్నారు.

ప్రజల డిమాండ్ మేరకు బస్సులు

మూసాపేట: ప్రజల డిమాండ్ మేరకు కాలనీలు, మిగతా ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ కూకట్‌పల్లి డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి అన్నారు. గురువారం కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లోని డిప్యూటి ఆర్ ఎం కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూకట్‌పల్లి, మియాపూర్-2, జీడిమెట్ల, హెచ్‌సీయూ, మేడ్చల్ డిపోలు తమ పరిధిలో ఉన్నాయని, సుమారు 711 బస్సులు నడుస్తున్నాయన్నారు. మరో 25 మెట్రో డీలక్స్ బస్సులు కొత్తవి వస్తున్నాయని తెలిపారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకునేలా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్.. ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... బుధవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒకరికి రూ. 2 వేల జరిమానా, ఐదుగురికి రూ.1500, మరో వ్యక్తికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం



వెంకటపాపయ్య నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, ఏఈ శ్రావణి తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటపాపయ్య నగర్‌లో డ్రైనేజీ, రోడ్ల సమస్యలను కాలనీవాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన గురువారం ఏఇ శ్రావణి, కాలనీలవాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో కొంతమేర డ్రైనేజీ లైన్, సీసీ రోడ్లకు ప్యాచ్‌వర్కు పనులు పూర్తి చేయాల్సి ఉందని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో పనులు పూర్తి చేస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, జూపల్లి జనార్దన్‌రావు, దేవేందర్‌రావు, నరసింహులు, జీవన్‌రెడ్డి, విక్కీ, ఎల్లయ్య, వెంకటస్వామిగౌడ్, అశోక్, వెంకట రెడ్డి, అంకంరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఎర్లీ బర్డ్ ’ వసూళ్ల టార్గెట్ రూ.64.41 కోట్లు

- మార్చి 31 వరకు 109.61 కోట్లు వసూలు
- చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి



రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్ : చందానగర్ సర్కిల్ 21 పరిధిలో 2024–2025 సంవత్సరానికి ఆస్తి పన్ను మార్చి 31వ తేదీ వరకు రూ.109.61 కోట్లు వసూలు చేశామని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో రెవెన్యూ విభాగం ఏఎంసీలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లతో ఎర్లీ బర్డ్ ఆఫర్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్లీ బర్డ్ ఆఫర్ కింద చందానగర్ సర్కిల్‌కు టార్గెట్ రూ.64.41 కోట్లు ఉందని, గత సంవత్సరం రూ.53.50 కోట్లు వసూలు చేయడం జరిగిందన్నారు. 2025–2026 సంవత్సరానికి ఆస్తి పన్ను మొత్తాన్ని ఏక కాలంలో ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా చెల్లిస్తే 5 శాతం రాయితీ వస్తుందని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈనెల 30 వరకు ఎర్లీబర్డ్ ఆఫర్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీలు మహేందర్‌రెడ్డి, కృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో అద్భుతమైన ఫలితాలు

కేపీహెచ్‌బీకాలనీ: కృత్రిమ మేధస్సుతో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని, విద్యార్థులు దానిని ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జేఎన్‌టీయూహెచ్ వీసీ టి. కిషన్ కుమార్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ ఐటీ తరపున సీఆర్‌సీలో స్పిరిట్ 2025 ఫెస్టివల్‌లో భాగంగా జనరేటివ్ ‘ఏఐ వర్క్ షాపు’ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సును ప్రతి రంగంలో ఉపయోగించవచ్చన్నారు. కార్యక్రమంలో వర్క్ షాపు ఫ్యాకల్టీ నవీన్‌కుమార్, స్టూడెంట్ కోఆర్డినేటర్ సుకుమార్ రెడ్డి, కార్తికేయ శర్మ, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదు ట్యాంకర్లు సీజ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నీటిని తరలిస్తున్న ట్యాంకర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. తెల్లాపూర్ శివారు ప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా నీటిని నగరానికి తరలిస్తున్న విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఐదు ట్యాంకర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐదు ట్యాంకర్లలను సీజ్ చేయటంతో పాటు నీటిని నిలువ కొలనులను ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొల్లూరు ఎస్ఐ రమేష్, ఆర్ఐ శ్రీకాంత్‌లున్నారు.



ప్రమాదకరంగా..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధి కొల్లూరు నుంచి ఈదులనాగులపల్లికి వెళ్లే మార్గం ప్రమాదకరంగా తయారైంది. నిత్యం ఈమార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కొల్లూరు శివారులోని రోడ్డు చివరి భాగం ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. ఈమార్గంలో నిత్యం వాహనదారులు భయంభయంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. గత కొన్ని నెలలుగా రోడ్డు ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట ప్రమాదం జరుగుతుందేమోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్‌యస్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: బీఆర్‌యస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. గురువారం శేరిలింగంపల్లి బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా శేరిలింగంపల్లిలోని హెచ్‌సీయూలో జరుగుతున్న విధ్వంసంను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. నాడు కేసీఆర్ ప్రకృతిని కాపాడుతూ హరితహారం పేరుతో చెట్లు నాటించారన్నారు. భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించడానికి కృషి చేశారన్నారు. బీఆర్‌యస్ పార్టీ ఖచ్చితంగా అధికారంలోకి వస్తుందని ప్రతి కార్యకర్త అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. ఈ నెల 27న జరిగే ప్లీనరీని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు, గోపరాజు శ్రీనివాస్‌రావు, రోజా, బిఎస్ఎం కిరణ్‌యాదవ్, మెడ్‌ప్లస్ శ్రీనివాస్, సయ్యద్ ముజీద్, మారబోయిన రవి యాదవ్, శ్రీకాంత్, సాయి, మిద్దెల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సంప్‌లు.. ఫలితం అంతంతేనా..?



లేక్‌వ్యూ గెస్ట్‌హౌస్ వద్ద వరదనీటి తరలింపు పనులను పరిశీలిస్తున్న డీసీ రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: కుండపోత వర్షంతో వరదనీరు ఏరులై పారింది. పలుచోట్ల వరదనీరు నిలిచిపోయి కొంతమేర సమస్య తలెత్తింది. వర్షాకాలం వరద నీరు నిలిచిపోయే ప్రాంతాల్లో సమస్య పరిష్కారానికి సంప్‌లు నిర్మించారు. కానీ ఈ విధానం అనుకున్న ఫలితాన్ని ఇవ్వలేదు.

- ముఖ్యంగా సోమాజిగూడ మెర్క్యూరీ హోటల్ చౌరస్తాలో వరదనీరు చాలాసేపు నిలిచిపోయి సమస్యలు తలెత్తాయి.
- ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలో సెక్రటేరియట్, లేక్ వ్యూ గెస్ట్ హౌస్, సోమాజిగూడ మెర్క్యూరీ హోటల్ వద్ద గత ఏడాది భారీ సంప్‌లను నిర్మించారు. వర్షాలు పడ్డప్పుడు వరదనీరు నిలిచిపోయి ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఈ సంప్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.
- గురువారం కురిసిన వర్షానికి భారీగా వరదనీరు ఈ సంప్‌ల్లోకి వెళ్లి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూశారు. అయినా సంప్‌ల వద్ద వరద నిలిచిపోయి ఇబ్బందులు తప్పలేదు.

మోటార్ల ద్వారా కాలువల్లోకి తరలింపు

- సంపులు నిండగానే మోటార్ల ద్వారా ఈ నీటిని వరదనీటి కాలువల్లోకి పంపించారు. ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి సంబంధిత ఇంజినీర్లతో కలిసి వరదనీటి సంపులను పరిశీలించారు. అన్ని సంపుల్లో మోటార్లను ఆన్ చేయించి వరదనీరు కాలువల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.
- గతంలో వర్షాలు పడ్డప్పుడు వరదనీరు ఈ ప్రాంతాల్లో మోకాలు లోతు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోయేది. రాకపోకలు నిలిచిపోయేవి. దీనిని దృష్టిలో పెట్టుకుని గత ఏడాది జీహెచ్‌ఎంసీ అప్పటి కమిషనర్ రోనాల్డ్‌రోస్ వరదనీటి సంపుల నిర్మాణానికి తెరతీశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి పక్కా ప్రణాళికతో పటిష్టంగా వీటిని నిర్మించారు.
- ప్రణాళికాబద్ధంగా వీటి నిర్మాణం జరిగిందా.. లేదా అన్నది .. వీటి వల్ల ఎంతవరకు ప్రయోజనం చేకూరుతుందో భారీ వర్షాలు కురిసినప్పుడు తేలనుంది.

అంగరంగ వైభవంగా | శ్రీరామనవమి వేడుకలు నిర్వహించాలి



కూకట్‌పల్లి రామాలయంలో పండగ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రామాలయంలో శ్రీరామనవమి పండగ ఏర్పాట్లుకు సంబంధించి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌లు గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఎక్కడెక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలో చూడాలన్నారు. వేసవి సందర్భంగా మంచినీరు అందేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 4వ తేదీ నుంచి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని ఆలయ ఈఓ, చైర్మన్‌లకు సూచించారు. భక్తులకు భోజనం, ప్రసాదం ఇవ్వాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. 436 ఏళ్ల చరిత్ర గల కూకట్‌పల్లి రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజాదేవి రంగారావు, మాజీ కార్పొరేటర్‌లు మాధవరం రంగారావు, పగుడాల బాబురావు, చైర్మన్ తులసీరావు, ఆలయ ఈఓ ఆంజనేయులు, ఆలయ స్థపతి పల్లి నాయకం, కూకట్‌పల్లి శివాలయం మాజీ చైర్మన్ సూర్యారావు, ఆలయ సిబ్బంది, శానిటేషన్, శాంతి భద్రతలు, ట్రాఫిక్, జీహెచ్‌యంసీ, వాటర్ వర్క్స్అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.